


# ప్రెస్టేజ్

వాణిశ్రీ

"తెల్లకాగితాలు ముందేసుకుని ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

తలెత్తి చూశాను. మా మురళీధరం మావయ్య, నవ్వుతూ కన్పించాడు.

"నువ్వా! మావయ్యా!...రా..రా.. దారితప్పి వచ్చినట్లున్నావే!"

"దారి తెలిసే వచ్చాను. ఏమిటి, ఏదో రాయాలనే ప్రయత్నంలో వున్నట్లున్నావ్ ?" అన్నాడు మావయ్య.

"అవును, ఈ రోజు ఆదివారంగదా, ఏదైనా కథ రాయాలనుకుంటున్నాను."

"నేను నీ మూడ్ చెడగొట్టాననుకుంటాను. సరే కానివ్వు, నేనీలోపల అమ్మతో బాతాఖానీ వేస్తుంటాను," అంటూ లోపలకు వెళ్ళబోయాడు.

"నో...నో...నేనింకా మూడ్‌లోకి రాలేదు. సరైన ప్లాట్ దొరకడంలేదు."

"అలాగా! నేనొక ప్లాట్ చెప్తాను గాని నా కేమిస్తావ్?"

"లంచమా?"

"ఆ మాట ఇందుకు వర్తించదు. కథ నాది. కేవలం మాటల గారడీ నీది. నీకు పత్రికవాళ్ళు రెమ్యూనరేషన్

ఇస్తారు నువ్వు నాకు సవయుగాలో వెట్ పార్టీ ఇవ్వాలి. ఓ.కే."

"నువ్వు చెప్పే ప్లాట్ నాకు నచ్చాలి. నేను రాయాలి. అది పత్రికలో పడాలి. అప్పుడుగదా పార్టీ. ఓ.కే." అన్నాను.

"అయితే రాసుకో. కథ పేరు ప్రిస్టేజ్."

"కొంపదీసి ఏ ఇంగ్లీషు కథకో అనువాదం కాదుగదా," అన్నాను అనుమానంగా మావయ్యవంక చూస్తూ.

"యూ, సిల్లీ! ఇది పూర్తిగా నా స్వంత అనుభవం. ఏ ఇతరుల అనుభవానికీ అనుసరణ కాదని హామీ ఇస్తున్నాను. చాలా? అయితే ఈ మధ్య తెలుగుకథకు ఇంగ్లీషు పేరుతో ముస్తాబు చెయ్యడం ఫ్యాషన్," అన్నాడు మావయ్య నవ్వుతూ.

"సరే కానివ్వు."

"ఆ రోజు నేను సత్తెనపల్లి బస్ స్టాండ్‌లో నిల్చున్నాను మాచెర్ల వెళ్ళాలి నేను. గుంటూరునుంచి హైదరాబాద్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ బస్ వచ్చేటైము అది. షెడ్యూల్ టైమ్ దాటిపోయింది. ఎక్స్‌ప్రెస్ బస్ రాలేదు. చాలా విసుగ్గావుంది నాకు. నీకు తెలుసుగా సత్తెనపల్లి బస్ స్టాండ్‌లో కూర్చోవడానిక్కూడా చోటువుండదు. ఇంతలో గుంటూరు నుంచి మాచెర్ల వెళ్లే ప్యాసింజర్‌బస్ వచ్చింది. ప్యాసింజర్‌లో ప్రయాణం నాకు బోర్‌గా వుంటుంది. ఇక్కడ నిలువుకాళ్ళమీద నిల్చోవడంకంటే అందులో ఎక్కి కూర్చోవటమే గుడ్డిలో మెల్లలా నయం అని ఎక్కాను. డ్రైవరు, కండక్టరు. కొందరు ప్రయాణీకులు బస్ దిగి హోటల్లలోకి వెళ్ళారు. పావు గంట తర్వాత కండక్టరు వచ్చి టిక్కెట్లు ఇచ్చాడు. తర్వాత ఎక్స్‌ప్రెస్ సర్రున దూసుకొచ్చింది హడావుడిగా. తొందరపడి ఇందులో ఎక్కినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను. మా బస్సు బయల్దేరింది. చిన్న చిన్న స్టాప్స్‌లోగూడా ఆగుతూ, ముక్కుతూ మూలుగుతూ పోతూవుంది. పిడుగురాళ్ళ పొలిమేరల్లో ఎక్స్‌ప్రెస్ మా బస్‌ను ఓవర్‌టేక్ చేసింది.

పిడుగురాళ్ళలో ఆగిన తర్వాత ఒక యువతి, బస్ ఎక్కి, "నేను గుంటూరునుంచి రెంటచింతలకు టిక్కెట్ తీసుకున్నాను. సత్తెనపల్లిలో నేను భోజనంచేసి వచ్చేలోపల మీరు వచ్చేశారు. తర్వాత నేను ఎక్స్‌ప్రెస్‌లో ఇక్కడికి వచ్చాను," అంది.

"అలాగా, సారీ మీరు ఎవరికీ చెప్పి వెళ్ళలేదా?" అన్నాడు కండక్టర్.

"లేదండీ. నెవర్ మైండ్," అని ఆమె సరాసరి లోపలికి వచ్చి నేను కూర్చున్న వెనుకసీటులో కిటికీప్రక్కన కూర్చున్న ఒక యువకుడితో "నేను ఇప్పుడే కూర్చుని గుంటూరునుంచి వస్తున్నాను. సత్తెనపల్లిలో భోజనానికి దిగాను. వెళ్ళేటప్పుడు ఈ సీట్లో వీక్లీ వుంచాను " అంది.

ఆ యువకుడు మారుమాట్లాడకుండా లేచి ఆమెకు సీటు ఇచ్చాడు. ఆమె కూర్చుని "ఇక్కడవీక్లీవుండాలి," అంది.

అతను అటూ, ఇటూచూసి పైన రాక్‌లోవున్న వీక్లీతీసి ఆమె చేతి కిచ్చాడు. ఆమె వీక్లీ పేజీలు తిరగేసి "మైగాడ్," అంది కంగారుగా.

అంతా ఆమెవైపు చూశాం ఏం జరిగిందా అని.

"ఇందులో వందరూపాయల కాగితం వుండాలి," అంది ఏడుపు ముఖంతో.

బస్ నిశ్శబ్దమైపోయింది. కండక్టర్ లేచివచ్చాడు. అప్పటివరకూ ఆ సీట్లో కూర్చున్న యువకునిముఖం పాలిపోయి వుంది.

"నాకేం తెలియదు," అన్నాడు.

"తీస్తే ఇచ్చెయ్యండి ప్లీజ్," అన్నాడు కండక్టర్.

"నిజం. అసలు నేనా వీక్లీ చూడ లేదు," అన్నాడు నెమ్మదిగా. అతని ముఖం అవమానంతో కుంచించుకు పోయింది.

"ఈ వీక్లీలో వంద కాగితం పెట్టి వెళ్ళారట ఆమె. ఎవరైనా తీసివుంటే ఇచ్చెయ్యండి దయచేసి," అన్నాడు కండక్టరు.

ఎవరూ మాట్లాడలేదు. ఒకళ్ళ ముఖం మరొకరు చూసుకున్నారు. తర్వాత గుసగుస లాడుకున్నారు.

"అందర్నీ చెక్ చెయ్యండి," అన్నారు ఎవరో వెనుకనుంచి.

"బాగుందండీ. ఎవరైనా పుస్తకంలో డబ్బుపెట్టి వదిలేసి వెళ్తారా? అయినా చెక్ చేస్తేమాత్రం ఎలా దొరుకుతుంది? ఇదుగో నా దగ్గిర పది వంద కాగి తాలు వున్నాయ్. అందులో ఒకటి ఆమెదే అనుకోండి. ఎలా తెలుస్తుంది?" అన్నాడు ఖద్దరు బట్టలు తొడుక్కున్న పెద్దమనిషి. బహుశా ఎవరో వ్యాపా రస్తుడనుకుంటాను.

పావుగంట సేపు తర్జనభర్జన జరిగింది.

"అసలు మీరు వీక్లీలో వందకాగితం ఎందుకు పెట్టారు?" అన్నాడు కండక్టర్ ఆమెతో.

"గుంటూరులో బస్ ఎక్కికూర్చున్న తర్వాత మా బాబాయి ఇచ్చాడు. నేను సూట్‌కేస్ తెరిచి పెట్టడానికి బద్ధ కించి చేతిలోవున్న వీక్లీలో పెట్టాను. తర్వాత అందులో పెట్టిన సంగతి మర్చి పోయి సత్తెనపల్లిలో దిగాను. భోజనం చేస్తుంటే మధ్యలో జ్ఞాపకంవచ్చిందిగాని నేను వచ్చేసరికి బస్ లేదు." అంది ఆమె.

బస్‌లో కొందరు విసుగు ప్రద ర్శించారు.

"ఎంతసేపు ఆపుతారు. రైట్ చెప్పండి," అన్నారు ఎవరో అసహనంగా.

"పోనివ్వండి, ఏం చేస్తాం?" అంది ఆమె

కండక్టర్ రైట్ చెప్పాడు. బస్ బయల్దేరింది.

బస్సులో ప్రయాణీకులు చాలామంది ఆ అమ్మాయి వీక్లీలో వందకాగితం పెట్టిందంటే నమ్మలేదు. ఇదొక బడాయి

అన్నారు. అసలా పిల్లకు మతిమరుపు ఎక్కువలాగుంది. ఎక్కడో పారేసుకుని పుస్తకంలో పెట్టానని గొడవచేసింది అన్నారు.

ఎవరూ నమ్మకపోయినా నేను నమ్మాను. ఎందుకు? చెప్పు," అని ఆగాడు మావయ్య.

"ఆ అమ్మాయి అమాయకురాలని నువ్వు గ్రహించివుంటావు. డబ్బు పోక పోయినా పోయిందని నలుగురికీ చెప్పుకున్నందువలన లాభం ఏముంది? ఆ అమ్మాయి చెప్పింది నిజమే" అన్నాను.

మావయ్య పక పకా నవ్వాడు. నేను విస్తుపోయి చూశాను.

మావయ్య నవ్వు ఆపుకుని, "పప్పులో కాలువేశావు" అన్నాడు.

"నువ్వే చెప్పు బాబూ" అన్నాను.

"ఆ వీక్లీలో వందకాగితం తీసుకుంది నేనే," అన్నాడు మావయ్య.

మూర్ఛపోయినంత పనైంది. నిజమా అన్నట్లు కళ్ళు పెద్దవిచేసి మావయ్య వంక చూశాను.

"నిజమే. సత్తెనపల్లిలో ఎక్కినప్పుడు ఆమె సీట్లో కూర్చుంది నేనే. అప్పుడు వీక్లీ అక్కడేవుంది. బస్ బయల్దేరినా ఎవరూ రాకపోయేసరికి, ఎవరో మర్చిపోయి దిగివుంటారనుకుని వీక్లీ చేతిలోకి తీసుకుని పేజీలు తిరగేస్తుంటే వందకాగితం కనిపించింది. మతిపోయినంత పని జరిగింది. ఎవరైనా అడిగితే ఇవ్వాలనే అనుకున్నాను. కాని ఎవరూ అడగలేదు. కాసేపటికి బస్ ఏదో వూరిలో ఆగింది. నా ముందు సీట్లో వాళ్లు దిగిపోయారు. ముందుసీట్లలో కాస్త సుఖంగా వుంటుంది. కుదుపులు వుండవు. అందుకని ముందుసీటులోకి మారిపోయాను. పోయేముందు ఆ వీక్లీలో వందకాగితం కాస్తా జేబులో వేసుకుని, వీక్లీని పైన రేక్ మీద పడేశాను. ఇక పిడుగురాళ్ళలో ఆమె ఎక్కి వందకాగితం పోయిందని గోల పెట్టిన తర్వాత నేను జేబులోనుంచి తీసి ఇద్దామా? అనుకున్నాను. కాని ఇవ్వలేకపోయాను. ఎందువల్ల? ప్రెస్టేజ్. ఆ వందకాగితం అలాగే వీక్లీలోవుంచేసి వుంటే తిరిగి ఇచ్చినా బాగుండేది. కాని తీసి జేబులో పెట్టుకుంటిని. ఇప్పుడు జేబులోనుంచి తీసి ఇస్తే అందరూ ఏమనుకుంటారు? భలే పెద్దమనిషిరా! ఎవరూ అడక్కుండావుంటే కొట్టేద్దామని జేబులో పెట్టుకున్నాడు అనుకుంటారు గదా. అందుకని ఆ వందకాగితం ఇవ్వాలనివున్నా ఇవ్వలేకపోయాను. ఆమె నాతోపాటు మాచెర్ల వచ్చివుంటే కథ వేరుగా వుండేది. బస్ దిగినతర్వాత ఆమెను ఒంటరిగా కలుసుకుని డబ్బు ఇచ్చి 'సారీ' చెప్పుకునేవాడిని. కాని ఆమె రెంటచింతలలో దిగిపోయింది. మళ్ళీ ఎప్పుడైనా కనిపిస్తుందేమోనని ఇప్పటికీ ఆ లైన్‌లో ప్రయాణం చేస్తున్నప్పుడు చూస్తూనే వున్నాను. చ్చ్...చ్చ్...ఆమె కన్పించనేలేదు." అని ముగించాడు మావయ్య.

---